అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం 01 మార్చి 2023

బాలుడి కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ప్రకటించిన జీహెచ్ఎంసీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

హైదరాబాద్‌లో కుక్కల దాడిలో మృతిచెందిన ఇందల్‌వాయి గ్రామానికి చెందిన బాలుడి కుటుంబానికి జీహెచ్ఎంసీ ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. జీహెచ్ఎంసీ నుంచి రూ.8 లక్షలు, కార్పొరేటర్‌ల నెల జీతం రూ.2 లక్షలు ..మొత్తం 10 లక్షల రూపాయలు ఆర్థిక సాయం ప్రకటించినట్టు ఇందల్‌వాయి ఎంపీటీసీ మారంపల్లి సుధాకర్ తెలిపారు. ఆర్టీసీ చైర్మన్ తనవంతుగా లక్ష రూపాయలు అందజేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చి మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారని, వెంటనే స్పందించిన కేటీఆర్ ఆదేశాల మేరకు జీహెచ్ఎంసి ప్రత్యేక సమావేశం నిర్వహించి కుక్కల దాడిలో మృతిచెందిన బాలుడి కుటుంబానికి ఆర్థిక సాయం ప్రకటించినట్టు తెలిపారు.

నేడు కేసీఆర్ రాక


మాడ వీధుల్లో గజవాహనంపై స్వామివారి ఊరేగింపు

నవతెలంగాణ-వర్ని

బీర్కూర్ మండలంలోని తిమ్మాపూర్‌లో తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవంలో పాల్గొనేందుకు సీఎం కేసీఆర్ నేడు (బుధవారం) రానున్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బాన్సువాడ వరకు వచ్చి అనంతరం రోడ్డు మార్గంలో ఆలయం వరకు రానున్నారు. అనంతరం జరిగే సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ వర్ని, చందూర్ మండలాల అధ్యక్షులు గిరి, మూడ్ అంబర్‌సింగ్ తెలిపారు.


ఎల్లారెడ్డిలో యూరియా కోసం ఎర్రటి ఎండలో బారులు తీరిన రైతులు

ఎర్రటి ఎండలో పడిగాపులు..

- యూరియా కోసం రైతన్నకు తిప్పలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

యూరియా కోసం ప్రతేడూ రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. సరిపడా సరఫరా లేక యూరియా కోసం రైతులు ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఎల్లారెడ్డి డివిజన్ కేంద్రంలో రైతులు యూరియా కోసం బారులు తీరారు. ముందస్తు ప్రణాళికలు చేపడుతున్నట్టు అధికారులు సమీక్షలు చేస్తున్నా.. చివరకు యూరియా మాత్రం అందడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. మొక్కజొన్న, జొన్న, వరికి యూరియా అవసరము న్నప్పటికీ ప్రభుత్వ సొసైటీల్లో నిల్వ ఉంచకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీన్ని అదునుగా తీసుకుంటున్న ప్రయివేటు డీలర్‌లు.. పురుగుల మందులు కొనుగోలు చేస్తేనే యూరియా అందజేస్తామని కొర్రీలు పెడుతుండటం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి యూరియా తెప్పించాలని రైతులు కోరుతున్నారు.

ఈ విషయమై ఏడీఏ రత్నం వివరణ కోరగా సొసైటీలకు నేడు, రేపు పూర్తి స్థాయిలో యూరియా అందుబాటులో ఉండనున్నట్టు తెలిపారు. యూరియా కోసం ప్రయివేటు వ్యాపారులు రైతుల నుంచి అధిక డబ్బులు వసూలు చేసినా, పురుగుల మందులు కొనుగోలు చేయాలని కొర్రీలు పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలువురు రైతులు తమ దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిపారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేయట్లేదనే అక్కసు

- నిబంధనల మేరకే రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం : రిజిస్ట్రార్ శ్రీలత


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ శ్రీలత

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ నియమ నిబంధనల మేరకే రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడుతున్నామని కామారెడ్డి రిజిస్ట్రార్ శ్రీలత తెలిపారు. మంగళవారం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి మాటా డారు. తెలంగాణ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ యాక్ట్ నియమాలను అనుసరించి రిజిస్ట్రేష న్లు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రిజిస్ట్రేషన్ యాక్ట్ ప్రకారం ఫీజులు వసూళ్లు చేస్తున్నామని ఎలాంటి రుసుము అదనంగా వసూళ్లు చేయడం లేదని తెలిపారు. కొంతమంది వ్యక్తులు అక్రమ రిజిస్ట్రేషన్లు చేయాలని తమపై ఒత్తిడి తీసుకువచ్చి ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. తాను ఎలాంటి తప్పులు చేయలేదని, తమపై దుష్ప్రచారం చేయవద్దని కోరారు. వీఎల్‌టీ చార్జీలు మున్సిపల్ అధికారులు మాత్రమే వసూళ్లు చేస్తారని తెలిపారు. నియమ నిబంధనలు అనుగు ణంగా చేస్తుంటే కొంత మంది తమపై అసత్య ప్రచారం చేస్తున్నా రని తెలిపారు. ఎవరి మాయ మాటలు ప్రజలు నమ్మవద్దని, నేరుగా కార్యాలయంలో తమ రిజిస్ట్రేషన్లు సాఫీగా చేసుకోవాలని సూచించారు.

పరీక్షలంటే ఒత్తిడికి గురికావొద్దు


రికార్డులు తనిఖీ చేస్తున్న సలాం

నవతెలంగాణ-తాడ్వాయి

పరీక్షలంటే ఒత్తిడికి గురికావొద్దని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. వార్షిక పరీక్షల నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసామని వివరించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. ఈ 10 రోజుల సమయం విద్యార్థులకు చాలా కీలకమైందని శ్రద్ధతో కష్టపడి చదివి పరీక్షలు రాస్తే ఉత్తమ మార్కులు సాధించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్ యూసఫ్ హుస్సేన్, నోడల్ కార్యాలయ సిబ్బంది రజాక్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అన్ని కుల సంఘాల అభివృద్ధే ధ్యేయం

- టైలర్‌డే పురస్కరించుకొని ర్యాలీ


ర్యాలీ చేపట్టిన మేరు కులస్తులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ, కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని కుల సంఘాల అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతుందని అర్బన్ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా అన్నారు. టైలర్స్ డే సందర్భంగా జిల్లా కేంద్రంలోని స్థానిక శివాజీ నగర్ ఆర్.ఆర్. చౌరస్తా నుండి జిల్లా మేరు సంఘం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని నగర మేయర్ దండు నీతూ కిరణ్, నూడా చైర్మన్ ప్రభాకర్ జండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అర్బన్ ఎమ్మెల్యే బిగల గణేష్ గుప్తా సంఘ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే, నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తు లను కాపాడేందుకు అహర్నిశలు కృషి చేస్తుందని, కుల వృత్తు లను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిది అని అన్నారు. మేరు కుల సంఘ సభ్యులు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారి సమస్య లను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం జిల్లాధ్యక్షులు సోమ హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి దేవిదాస్, గంగా కిషన్, కోశాధికారి చంద్రకాంత్, నగర అధ్యక్షులు మంతెన దశరథ్, అశోక్, సుదర్శన్, తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ కేవైసీ సర్వే


కొనసాగుతున్న సర్వే

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని ఒకటో వార్డులో ఆయుష్మాన్ భారత్ కేవైసీ సర్వేను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ వైస్ చైర్మన్ అమ్ముల పశుపతి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్ కేవైసీని నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో వార్డ్‌మెంబర్ అమ్ముల శృతి, ప్రోగ్రాం అధికారి దండబోయిన గంగాధర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

దేశాయి బీడీ కంపెనీపై చర్యలు తీసుకోవాలి

- కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న టేకేదార్ గంగాధర్‌ను తొలగించాలి
- తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

దేశాయ్ బీడీ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, మోస్రలోని టేకేదారు గంగాధర్ అనేక ఇబ్బందులకు కార్మికులకు గురి చేస్తున్నాడని అతన్ని వెంటనే తొలగించాలని తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. మంగళవారం నిజామాబాద్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ దేశాయి బీడీ ఫ్యాక్టరీ పరిధిలోనున్న కార్ఖానాలలో బీడీ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా ఆకు తంబాకు 1000 బీడీలకు సరిపడా వేయటం లేదని తెలిపారు. నాసిరకం ఆకు వేయటం మూలాన బీడీ కార్మికులు అదనంగా ఆకు కొని బీడీలు చుట్టి ఇవ్వాల్సి వస్తోందని తెలిపారు. మోస్రా మండలం కొత్తపేట్ గ్రామంలోని ఒక సెంటర్లో బీడీ కార్మికులను టేకేదారు గంగాధర్ అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నాడని అతన్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. దీనికీ తోడు మహిళలను మానసికంగా వేధించటం భూతు మాటలు తిట్టడం నిత్యకృత్యమైనట్టు తెలిపారు. అదనంగా 1500 బీడీలు తీసుకుంటున్నారని, కొత్త కార్డు పెట్టివ్వడానికి వారి నుంచి రూ.6000 వరకూ వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఇలాంటి వాటిపై విచారణ చేపట్టాలని, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్‌గౌడ్, బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్, జిల్లా ఉపాధ్య క్షురాలు విమలమ్మ, ఏశాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్ పట్టణాభివృద్ధికి రూ.25 కోట్లు

- బీజేపీ నాయకులు పనికిరాని విమర్శలు మానుకోవాలి : బోధన్ ఎమ్మెల్యే షకీల్


మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే షకీల్

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణ అభివృద్ధికి మరో 25 కోట్ల రూపాయల నిధుల మంజూరికి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అంగీకరించారని కావున త్వరలో బోధన్ పట్టణంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతానని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలో పర్యటించారు. పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకు న్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బోధన్ నియోజకవర్గ అభివృద్ధికి సీఎం నిధుల నుంచి 11.5 కోట్లు విడుదల అయ్యాయని వాటితో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. బోధన్ పట్టణంలో నిర్మించిన 400 డబుల్ బెడ్ రూం ఇండ్లను త్వరలో అర్హులైన పేదలకు పంపిణీ చేస్తామని మరో 1500 మందికి ప్లాట్లను కేటాయించి డబుల్ బెడ్ రూం ఇంటి నిర్మాణానికి 3 లక్షల రూపాయలు మంజూరి చేస్తామన్నారు. వ్యక్తిగత ఇంటి నిర్మాణం చేపడుతున్న వారికి త్వరలో బిల్లులు మంజూరి చేయనున్నట్టు చెప్పారు. పేదలకు ఇచ్చే ఇండ్లపై కొందరు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అలాంటిది మాని అభివృద్ధిపై చర్చకు రావాలన్నారు. తాను ఇచ్చిన మాట ప్రకారం పట్టణంలో స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ఎన్నికల ముందు ఖద్దరు బట్టలు వేసుకుని తిరిగే ఈ నాయకులు ఏ ఒక్కరికి చిన్న సహాయం చేయలేదని అలాంటి వారు విమర్శలు చేయడం హాస్యస్పదమన్నారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ తన నియోజకవర్గ అభివృద్ధి మరిచి నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో ఏఎంసీ చైర్మెన్ వీఆర్ దేశాయి, పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, కార్యదర్శి అబ్దుల్ రహమాన్, మధు తదితరులు పాల్గొన్నారు.

నిధులు రావట్లే.. పనులెలా చేపట్టాలి

- సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌ల ప్రశ్న


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ సాయిరెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

పంచాయతీలకు నిధులు రావట్లేదని, గ్రామంలో పనులు ఎలా చేపట్టాలని సర్పంచ్‌లు ప్రశ్నించారు. వచ్చే నిధులు ట్రాక్టర్ డీజిల్ ఖర్చులకు సైతం సరిపోవడం లేదని, నిధులు రాక కార్మికులను తొలగించాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ కుంచాల విమల రాజు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఎంపీఓ యూసుఫ్‌ఖాన్ గ్రామపంచాయతీ నిధుల గురించి మాట్లాడుతుండగా మునిపల్లి సర్పంచ్ సాయిరెడ్డి మాట్లాడుతూ మా జీపికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తొమ్మిది లక్షల రూపాయలు రావాల్సి ఉండగా ఒక లక్ష రూపాయలు వస్తే ఏ విధంగా పనులు చేయించాలని ప్రశ్నించారు. గ్రామపంచాయతీలో నిధులు లేక పారిశు ద్ధ కార్మికులను తొలగించామని చందా మియాబాగ్ సర్పంచ్ కిషన్ నాయక్ అన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం అన్ని గ్రామాలలో మరుగుదొడ్లు నిర్మించి హరితహారంతో గ్రామాలన్ని ప్రశాంతంగా ఉన్నాయని వివరించగా పడకల్ ఎంపీటీసీ గంగారెడ్డి మాట్లాడుతూ పల్లెలు ఇంకా బాగుపడలేదని, ఎప్పటి మాదిరిగానే ఉన్నాయని అధికారులు పర్యవేక్షించి అభివృద్ధి వైపు తీసుకెళ్లాలని కోరారు. ఇటీవల కొత్తగా పెన్షన్ కార్డులు వచ్చిన వారికి పెన్షన్ డబ్బులు రావడం లేదని, దీంతో పాటు 91 ఏండ్లు నిండిన వారికి పెన్షన్ రావట్లేదు కానీ వారింట్లో ముగ్గురు కొడుకులకు పెన్షన్ వస్తున్నట్టు పడకల్ ఎంపీటీసీ గంగారెడ్డి అన్నారు. 10 , 20 ఎకరాల భూమి, కార్లు ఉన్న వారికి సైతం పెన్షన్ వస్తున్నట్టు ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంచాల విమల రాజు, వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి ఎంపీడీవో లక్ష్మణ్ తాసిల్దార్ మల్లేష్ అన్ని గ్రామాల సర్పంచ్లు ఎంపీటీసీలు సొసైటీ చైర్మన్లు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ


జీవాలకు మందులు వేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-జుక్కల్

మండలం లోని డోన్గాం గ్రామంలో జీవాలకు ఉచిత నట్టల నివారణ శిబిరాన్ని సర్పంచ్ గజిరే కళావతి మంగళ వారం ప్రారం భించి నట్టు వెటర్నరీ డాక్టర్ పండరినాథ్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు రాజు, రైతులు పాల్గొన్నారు.

గూడు గోడు

- ఎర్రజెండ అండతో నెహ్రూనగర్‌లో గుడిసెలు వేసుకుంటున్న పేదలు


గుడిసెలు వేసుకుంటున్న పేదలు

నవతెలంగాణ-నిజామాబాద్

తలదాచుకునేందుకు జాగ కోసం పేదలు పోరుబాట పట్టారు. ఎన్నికలు వచ్చినప్పుడు పలకరించే పాలకులు.. ఆ తర్వాత ఓట్లు వేయించుకొని పత్తా లేకుండా పోతుండటంతో తమ గోడు వినేవారు లేరని ఆవేదనకు గురవుతున్న పేదలకు ఎర్రజెండా అండగా నిలుస్తోంది. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని జానకంపేట్ నెహ్రూనగర్‌లో పేదలు సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూ పోరాటం కొనసాగిస్తున్నారు. దీంట్లో భాగంగా మంగళవారం పిల్లాజెల్లాతో కలిసి గుడిసెలు వేసుకున్నారు.


తండ్రితో పాటు తనయుడి ఆరాటం..


పోరాట స్థలం వద్ద నిద్రిస్తున్న చిన్నారి..


వంట, భోజనాలు అన్నీ ఇక్కడే


గుడిసెలో పేదలు, నాయకులు

రోడ్డు ప్రమాదాలు నివారించాలి

- పకడ్బందీగా చర్యలు చేపట్టాలి
- రోడ్డు భద్రతా జిల్లా కమిటీ సమావేశంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు


మాట్లాడుతున్న కలెక్టర రాజీవ్‌గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన రోడ్డు భద్రతా జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. పోలీస్, రవాణా, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్, జాతీయ రహదారుల సంస్థ, జిల్లా వైద్యారోగ్య శాఖ, ఆర్టీసీ, రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొని రోడ్డు ప్రమాదాలపై చర్చించారు. జిల్లా మీదుగా రెండు ప్రధాన జాతీయ రహదారులు వెళ్తుండడం వల్ల తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నందున, వాటికి ఆస్కారం లేకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాలను బ్లాక్ స్పాట్లుగా పరిగణిస్తూ, ప్రమాదాలకు దారి తీస్తున్న పరిస్థితులను గల కారణాలను గుర్తించాలన్నారు. పోలీస్, ఆర్అండ్‌బీ, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తూ జాయింట్ సర్వే నిర్వహించి సమగ్ర నివేదిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఒక్కో ప్రాంతం వారీగా సునిశిత పరిశీలన జరపాలన్నారు. ప్రమాదాలకు మూల మలుపులు, కల్వర్టులు, ఎత్తుపల్లాలు, రోడ్డు నిర్మాణం సరిగా లేకపోవడం వంటి కారణాలను గమనిస్తే, వాటిని వెంటనే సరి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో వాహనదారులను అప్రమత్తం చేసేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్టీసీ డ్రైవర్లు సహా, ఇతర ప్రైవేట్ వాహనాల ఆపరేటర్లకు రోడ్డు భద్రతా చర్యలు విధిగా పాటించేలా నిబంధనల పట్ల స్పష్టమైన అవగాహన కల్పించేందుకు విస్తృత చర్యలు చేపట్టాలన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంతో పాటు ఇతర పట్టణాల్లోనూ ముఖ్య కూడళ్ళు, ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా, ప్రమాదాలు జరుగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. డివైడర్లు, ఐలాండ్‌ల వల్ల ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయా అన్నది గుర్తించాలన్నారు. నగరంలో వాహనాల పార్కింగ్ కోసం అనువైన ప్రదేశాలను గుర్తించాల్సిన ఆవశ్యకత ఉందని సమావేశంలో సభ్యులు అభిప్రాయపడ్డారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, వివిధ శాఖల అధికారులు, రెడ్ క్రాస్ ప్రతినిధి బుస్స ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కంటి శిబిరంను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంను తండా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని మిట్టపల్లి తండా సర్పంచ్ భదవత్ సంతోష్ నాయక్, ఇంచార్జీ ఎంపిఓ నిట్టు కిషన్ రావు అన్నారు. మంగళవారం మిట్టపల్లి తండా లో కంటి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందల్‌వాయి ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలో గ్రామపంచాయతీలో ఏర్పాటుచేసి కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆశాకార్యకర్తలు ఇంటింటికి తిరిగి కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి కంటి పరీక్ష శిబిరానికి రప్పించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యురాలు నవత, మానస, ఏఎన్ఎం దేవి మేరి, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి కార్యకర్తలు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

తక్షణ ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని అంకాపూర్ గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త పైడి రాకేష్ రెడ్డి మానవతా దృక్పథంతో తక్షణ సహాయం అందజేయడం పట్ల పలువురు అభినందించారు. డొంకేశ్వర్ మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు గోనె రవి ఆకస్మికంగా మరణించాడు. దీంతో పదివేల రూపాయల తక్షణ ఆర్థిక సహాయం మంగళవారం అందించారు. కార్యక్రమంలో కళ్లెం సంతోష్ రెడ్డి, సుంచనార్ చిన్న, తదితరులు పాల్గొన్నారు.



జగతికి మూలం సైన్స్

- నిజామాబాద్ నగర దండు నీతు కిరణ్ శేఖర్
- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు
- పలు పాఠశాల్లో ఘనంగా సైన్స్ దినోత్సవం

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం పాఠశాలల్లో సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల ప్రాజెక్టులను తయారుచేసి ప్రదర్శించారు. వాటి పనితీరు గురించి ఇతర విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తయారు చేసిన పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రాజెక్టులను తయారుచేసిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

నవతెలంగాణ-విలేకరులు

కంఠేశ్వర్ : నిజామాబాద్ నగరంలోని గూపన్‌పల్లి లోగల శ్రీ చైతన్య టెక్నో హై స్కూల్లో ఏర్పాటు చేసిన వైజ్ఞాన ప్రదర్శనను మేయర్ ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటుచేసిన వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకించారు. వాటిని తయారు చేసిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని న్యాల్కల్ రోడ్‌లోగల హెూవార్డ్ వైజ్ఞానిక ప్రదర్శనలను ఏర్పాటుచేశారని ప్రిన్సిపల్ డాక్టర్ టీఎస్ శశికళ, కరస్పాండెంట్ టీవీఆర్ మూర్తి, కోఆర్డినేటర్ లక్ష్మీ తెలిపారు.

నిజామాబాద్‌నగంలోని అర్సపల్లిలోని వివేక్ పాఠశాలలో పల్లెఅందాలు, గాలి కాలుష్యం, శరీర అవయవాల పనితీరు, వర్షపు నీటి నిల్వ, వ్యవసాయం గురించి ప్రాజెక్టులు ఏర్పాటుచేసి వివరించారు.



ధర్పల్లిలో...

నాందేవాడలోగల స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాలలో సైన్స్ మోడల్స్, ప్రయోగాలను ప్రదర్శించి వివరాలను చాట్ల ద్వారా ప్రదర్శించి వాటి గురించి వివరించారు

మారుతినగర్‌లోని స్నేహ సొసైటి ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్‌లో జాతీయ సైన్సు దినోత్సవానికి ముఖ్య అతిథిగా జిల్లా సైన్సు అధికారి గంగా కిషన్ హాజరై ప్రసంగించారు.

నిజామాబాద్ శ్రీ చైతన్య వినాయక్ నగర్ బ్రాంచ్‌లో సైన్స్ దినోత్సవానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ తూకారం రాథోడ్ హాజరై మాట్లాడారు.

ధర్పల్లి మండల కేంద్రంలో హంసవాహిని పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు పర్యావరణ, వాటర్ ట్యాంక్, హైడ్రాలిక్ వేబ్రిడ్జ్ ప్రాజెక్ట్, డ్రిప్ ఇరిగేషన్, ఎన్విరాల్‌మెంట్ పొల్యూషన్ వంటివి ఏర్పాటుచేసి ప్రదర్శించారు.

జక్రాన్‌పల్లి మండల కేంద్రంలోని పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించినట్టు ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ శ్రీనివాస్ తెలిపారు. సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, విద్యార్థులు వివిధ రకాల సైన్స్ పరికరాలతో ఎగ్జిబిషన్ నిర్వహించారు.

ఆర్మూర్ మండలంలోని కోమన్ పల్లి హైస్కూల్‌లో విద్యార్థులు తయారుచేసిన వివిధ నమూనాలను ప్రదర్శించారు. సైన్స్ ఆవశ్యకత అనే అంశంపై వ్యాసరచన పోటీలు, క్విజ్ పోటీలను నిర్వహించారు.

ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద గల ప్రజ్ఞ ఐఐటి పాఠశాలలో విభిన్న రకాలతో చిన్నారులు రూపొందించినటువంటి ప్రయోగాలు అబ్బురపరిచాయి.

కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని మిసిమి ఉన్నత పాఠశాలలో 96 మంది విద్యార్థులు యూకేజీ నుండి 9వ తరగతి వరకు విద్యార్థులు తయారుచేసిన రకరకాల ప్రయోగాలు ఆకట్టుకున్నాయి.

మోర్తాడ్ మండల కేంద్రంలోని కృష్ణవేణి హై స్కూల్‌లో వందకు పైగా సైన్స్, మ్యాస్, సోషల్, వైద్య తెలంగాణ సాంస్కృతిక , పార్లమెంట్ భవనం తదితర పరికరాలను ప్రదర్శించారు.

ముప్కాల్ మండలంఓని రెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ప్రదర్శనలను ఏర్పాటుచేశారు.

నవీపేట్ మండల కేంద్రంలోని స్కాలర్స్ పాఠశాలలో విద్యార్థి చేసిన స్మార్ట్ హెల్మెంట్ ఎంతగానో ఆకర్షించింది. వర్షిత సిరి చందన చేసిన రామన్ ఎఫెక్ట్ లను ఎంఈఓ గణేష్ రావు, ఎస్సై రాజారెడ్డి ప్రశంసించారు.

భీంగల్ పట్టణకేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ప్రదర్శనలను కరస్పాండెంట్ షఫీ, డైరెక్టర్ సనాలు పరిశీలించారు. ఉత్తమ ప్రదర్శనలను చేసినవారిని అభినందించి బహుమతులను అందజేశారు.



కంఠేశ్వర్: శ్రీచైతన్య టెక్నోలో ప్రదర్శనలు పరిశీలిస్తున్న మేయర్



ఆర్మూర్ : ప్రజ్ఞ పాఠశాలలో..



కంఠేశ్వర్: వివేక్ పాఠశాలలో



కంఠేశ్వర్: హోవర్డ్ పాఠశాలలో



మోర్తాడ్ మండలంలో..



నవీపేట్: స్కాలర్స్ పాఠశాలలో



కమ్మర్‌పల్లి: మిసిమి పాఠశాలలో



కంఠేశ్వర్: స్ప్రింగ్‌ఫీల్డ్ పాఠశాలలో



కంఠేశ్వర్: స్నేహసొసైటీలో



కంఠేశ్వర్: శ్రీచైతన్య పాఠశాలలో..

వైద్య బిల్లులు వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రభుత్వ పెన్షనర్లకు సంబంధించి డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌లో పెండింగ్‌లో ఉన్న వైద్య బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కే రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎస్ మదన్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వందల సంఖ్యల్లో పెన్షనర్ల రీయంబర్స్‌మెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే వీటిని ఆమోదించే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదే విధంగా ట్రెజరరీ నుండి నగదు చెల్లించేందుకు పంపిన వైద్య బిల్లులు కూడా ఈ కుబేర్‌లో నెలల తరబడి పెండింగ్లో ఉన్నాయని వారు తెలిపారు.

లింగి తాండలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మండలంలోని లింగి తండాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వచ్చిన 15 లక్షల రూపాయ తో సిసి రోడ్ల పనులను మంగళవారం ప్రారంభించారు. ఎంపీపీ బానోత్ ప్రేమ్ నాయక్ , మండల పార్టీ అధ్యక్షులు మీసాల మధుకర్ రావు, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, సర్పంచ్ మక్కల అరుణ సాయిలు, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్ తదితరులు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.

అంగన్వాడీ సమ్మెను జయప్రదం చేయండి

- సీఐటీయూ

నవతెలంగాణ-కంఠేశ్వర్

అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా మార్చ్ ఒకటి రెండు మూడు తేదీల్లో నిర్వహించే సమ్మెలో జిల్లాలోని అంగన్వాడీ ఉద్యోగులు పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని అంగన్వాడి జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. 40 సంవత్సరాలకుపైగా ఐసీడీఎస్‌లో పనిచేస్తూ పేద ప్రజలకు సేవలు అందిస్తున్న అంగన్వాడీ ఉద్యోగులకు కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, తదితర సౌకర్యాలు ఏవీ అమలు కాకపోవటంతో అంగన్వాడీ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారంకోసం అనేకమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో దశల వారి ఆందోళనలో భాగంగా మూడు రోజుల సమ్మె నిర్వహిస్తున్నట్లు యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ రమేష్ బాబు తెలిపారు. తమిళనాడు, కర్నాటక, పాండిచ్చేరి తదితర రాష్ట్రాల్లో అంగన్వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని. హెల్త్ కార్డులు ఇచ్చారని కేరళ, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల్లో రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్స్, పండగ బోనస్ తదితర సౌకర్యాలు ఇవేవీ అమలు జరపకుండా అంగన్వాడీ వర్కర్లను టీచర్లుగా పేరు మాత్రం మార్చారని పేర్కొన్నారు.

టీచర్లతో సమానంగా వేతనాలు ఇవ్వడం లేదని తెలిపారు. సమస్యలతోపాటు 20 డిమాండ్లతో మూడు రోజులపాటు జరిగే సమ్మెలో మొదటి రోజు నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ కేంద్రాలలో ఆర్డీవో కార్యాలయం వద్ద భీంగల్‌లో మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద మిగతా రెండు రోజులు జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద నిరసన కార్యక్రమా లు ఉంటాయని పేర్కొన్నారు. వీటిలో ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ర్యాలీకి వెళ్లిన విద్యార్థులు

- హెచ్ఎంను ప్రశ్నించిన విద్యార్థుల తల్లిదండ్రులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఉపాధ్యాయుల అనుమతి లేకుండా విద్యార్థులు బయటకు ఎలా వెళ్ళారని విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం శంకర్ భవన్ స్కూల్‌కు వచ్చి హెడ్మాస్టర్‌ను, పీఈటీ టీచర్‌ను ప్రశ్నించారు. పిల్లలను పాఠశాలకు చదువు నేర్చుకోవడానికి పంపిస్తున్నామని, అనుమతులు లేకుండా విద్యార్థులను ర్యాలీలకు, నిరసనలకు ఏ విధంగా పంపిస్తున్నారని హెచ్ఎంను నిలదీశారు. విద్యార్థుల తల్లిదండ్రులు సోషల్ మీడియాలో వచ్చిన వీడియోను చూసి స్కూల్‌కు వెళ్లారు. తమ పిల్లలు ప్రీతి మృతిపై విద్యార్థి సంఘంతో వెళ్లి నిరసన కార్యక్రమానికి ఎలా పంపించారని ప్రశ్నించారు. కనీసం 9 మంది విద్యార్థులు బయటకు వెళ్లిన మీకు ఏమాత్రం తెలియకపోవడం ఎంతవరకు సమంజసమని అన్నారు.

క్రిష్ణవేణి విద్యార్థుల క్షేత్ర పర్యటన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని క్రిష్ణవేణి ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం మండల కేంద్రంలో పలు క్షేత్రాలను సందర్శించారు. మండల నర్సరీని సందర్శించి మొక్కల పెంపకం, సస్య రక్షణ గురించి తెలుసుకున్నారు. కంపోస్ట్ షెడ్‌ను సందర్శించి పనికిరాని వస్తువులను కంపోస్టు షెడ్‌లో నిల్వ ఉంచి, కాంపోస్టు ద్వారా సహజ ఎరువులు తయారు చేసుకుని పంటలను పండించడం ద్వారా మంచి ఆహారం తీసుకోవడానికి ఆస్కారం ఉంటుందని విద్యార్థులు తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్ఇఓ మహేందర్ మాట్లాడారు. ప్రతినిత్యం ఆరోగ్య ఆహార నియమాలు పాటించాలని, వ్యక్తిగత పరిశుభ్రత గురించి తెలియజేశారు. అనంతరం మండల కేంద్రంలోని పసుపు పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త బి. మహేందర్‌ను సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త శ్రీనివాస్ పసుపును ఎలా పండిస్తారో, పసుపు ఎన్ని రకాలుగా ఉంటాయో, తదితర అంశాలపై వివరించారు. విద్యార్థులు వారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చిలుక గంగా ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కుందారం సచిన్, ఉపాధ్యాయులు కమల్, నాగశ్రీ, స్రవంతి, మనోజ్ఞ, జ్యోతి, స్వప్న, రూప శ్రీ, షాహిన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ కథల పోటీల్లో తడపాకల్ విద్యార్థినికి బహుమతి



విద్యార్థినికి నగదుబహుమతి, ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న హెచ్ఎం

నవతెలంగాణ-ఏర్గట్ల

పత్తిపాక ఫౌండేషన్, గరిపెల్లి ట్రస్ట్ సిరిసిల్ల వారి ఆధ్వర్యంలో సంయుక్తంగా గత డిసెంబర్ లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పాఠశాల విద్యార్థుల కథల పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తడపాకల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్న షేక్ సమీనా రాసిన "సైన్స్ మార్పు"అనే కథకు బహుమతి లభించిందని తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ తెలియజేశారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బహుమతి పొందిన షేక్ సమీనాకు నగదు బహుమతి తో పాటు, ప్రశంసా పత్రాన్ని విలువైన పుస్తకాలను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయ బృందం రవీందర్, కృష్ణ ప్రసాద్, నాగప్ప, నరేందర్, శంకర్, గంగాధర్, స్వప్న సుజాత, విజయ పాల్గొన్నారు.

మెడికో సైఫ్‌ను బహిరంగంగా ఉరితీయాలి

- ఏఐఎఫ్‌డీఎస్ సైఫ్ దిష్టి బొమ్మ దహనం

నవతెలంగాణ-కంఠేశ్వర్

మెడికో సైఫ్ ను బహిరంగంగా ఉరితీయాలని అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య (ఏఐఎఫ్‌డీఎస్) జాతీయ కన్వీనర్ రాజశేఖర్ అన్నారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్ డీఎస్ జాతీయ కన్వీనర్ మేత్రి రాజశేఖర్ మాట్లాడుతూ.. విద్యార్థినులపై ర్యాగింగ్ పేరుతో వేధింపులు కులాలు పేరుతో మానసిక వేధింపులు పెరిగిపోతున్నాయన్నారు. మెడిసైకో సైఫ్ దిష్టిబొమ్మకు ఉరితాడు వేసి నగరంలో ఊరేగింపు చేసి స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో దహనం చేశారు. ప్రీతి పడిన బాధ ఆడియోలు నెట్లో, సోషల్ సైట్లలో హల్‌చల్ చేస్తున్న ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్డిఎస్ జిల్లా కన్వీనర్ ఎండి మోసిన్, వినోద్ , గోపాల్, ఆదర్శ్, విలాస్, అస్లాం పాల్గొన్నారు.

నాణ్యతతో పనులు పూర్తి చేయాలి

- సాంబారు మోహన్



పనులను ప్రారంభిస్తున్న సాంబారు మోహన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నాణ్యత ప్రమాణాలతో కూడిన పనులను పూర్తి చేయాలని, గ్రామాల అభివృద్ధికి ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రత్యేక కృషి చేస్తున్నారని ఓడీసీఎంఎస్ చైర్మన్ సాంబారు మోహన్ అన్నారు. మంగళవారం ఇందల్‌వాయి మండలంలోని నల్ల వెల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన 15 లక్షలతో నిర్మించనున్న సిసి రహదారులకు ఎంపిపి బాదవత్ రమేష్ నాయక్, సర్పంచ్ నోముల విజయ లక్ష్మి లక్ష్మారెడ్డి, వైస్ ఎంపిపి బుసని అంజయ్య తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని అన్ని వాడల్లో సీసీ రాహదరులను, ఇతర పనులను పూర్తి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో బీసీసెల్ మండల అద్యక్షులు సాంబారు విఠల్, గ్రామ కమిటీ అధ్యక్షులు ఎడ్ల శ్రీనివాస్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నీరాడి మనోహర్, వార్డు,విడిసి సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గ్రామాలను అభివృద్ధి పథంలోకి తేవాలి

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ నల్ల సారిక హన్మంత్‌రెడ్డి

నవతెలంగాణ-ధర్పల్లి

గ్రామాల్లో జరుగుతున్నా అభివృద్ధి పనులకు సర్పంచులు,ఎంపిటిసిలు కలిసి కట్టుగా సహకారం అందిస్తు గ్రామాలను అభివృద్ధిపథంలోకి తేవాలని ఎంపీపీ నల్ల సారిక హన్మంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రూరల్ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అందిస్తున్న అనేక నిధుల ద్వారా గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని విధుల ద్వారా అన్ని సమస్యలు పరిష్కరించే అవకాశం ఉందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు ఎలాంటి తారతమ్యాలు లేకుండా అభివృద్ధిపై దృష్టి సాధించాలని కోరారు. అనంతరం ఆయాశాఖల అధికారుల పనులపై సభ్యులు చర్చించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎండిఓ నటరాజ్, తహసీల్దార్ గంగ సాగర్, వైస్ ఎంపీపీ నవీన్ రెడ్డి, అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సారిక

అవినీతికి పాల్పడలేదు

- ఆరోపణలు నిరాధారం

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

తమ హయాంలో ఎలాంటి అవినీతికి పాల్పడలేదని కమ్మ సంఘం మాజీ అధ్యక్షుడు కలగరి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మాధవనగర్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై గానీ తన పీరియడ్‌లో ఉన్న కమిటీ పైన గాని వచ్చిన ఆరోపణలు అన్నీ కూడా నిరాధారమైనవని, తాము ఎక్కడ కూడా అవినీతికి పాల్పడలేదని తెలిపారు. సంఘాన్ని ఎంతగానో అభివృద్ధి చేశామని తెలిపారు. అప్పుడు నిజామాబాద్‌లో ఏసీ ఫంక్షన్ హాల్స్ ఎక్కువగా లేవని, అయినా కమ్మసంఘం ఏసీ ఫంక్షన్ హాల్‌గా మార్చామని, వ్యక్తిగతంగా అప్పులు తీసుకొచ్చి కమ్మ సంఘంక్క అభివృద్ధి చేశామన్నారు. ఈ అప్పుల విషయంలో కూడా 2019 జూన్ 30న అందరి సభ్యుల సమక్షంలో ఆమోదించబడిన 8 మందిని పెద్ద మనుషులుగా నిర్ణయించారని తెలిపారు. దాంట్లో అనారోగ్య కారణాలవల్ల ముగ్గురు స్వచ్ఛందంగా వెళ్ళిపోగా మిగిలిన ఐదుగురు సభ్యులు పెద్దమనుషులు పోలవరపు వెంకట సుబ్బారావు, నల్లమోతు వెంకట రామయ్య, ములకల ఉమామహేశ్వరరావు, బండ్ల వెంకటేశ్వరరావు, ఎలవర్తి శ్రీనివాసరావు కొనసాగుతున్నారని అన్నారు. వీరు కమ్మ సంఘానికి సంబంధించిన జమ ఖర్చు అప్పులు తేల్చి భవిష్యత్తులో సంఘం అభివృద్ధికి సంబంధించి సలహాలు ఇచ్చి తుది నిర్ణయం తీసుకునేవారని తెలిపారు. 91,13,193 రూపాయలు బ్యాంకులో ఉన్న అప్పు, ఇతర వ్యక్తిగత వ్యక్తుల నుండి తీసుకువచ్చిన అప్పు 96,15,442 రూపాయలు మొత్తం అప్పు ఒక 1 కోటి 87 లక్షల 28 వేల 635 రూపాయలు అప్పు నిజమైనదని ఏప్రిల్ 19 2015 నాడు అందరి సమక్షంలో తీర్మానించారని తెలిపారు. లెక్కలు పరిశీలించి సరిచేసి సరిచూసి 31 జులైన 2019 నాటికి మొత్తం అప్పును ఒక కోటి 53 లక్షల రూపాయలుగా నిర్ణయించినట్టు చెప్పారు. దీనికి సంబంధించి ఈ అప్పు ముట్ట చెప్పడానికి నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని అమ్మి గాని లేదా ఇతర మార్గాల ద్వారా రాబట్టి ఈ బాకీ మొత్తం ముట్ట చెప్పి కొత్తగా రాబోవు నూతన కమిటీకి ఈ సంఘాన్ని అప్పజెప్పాలని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. సమావేశంలో సంఘం అధ్యక్షులు కలగా రి వెంకటేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి కృష్ణా రావు, జాయింట్ సెక్రటరీ సురేష్, మండవ రామ కృష్ణ, మాజీ కార్య దర్శి చిండు నరేష్. రవీంద్రనాథ్ ఠాగూర్, సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ అధ్యక్షులు కలగరి శ్రీనివాస్‌రావు

సమస్యలు పరిష్కరించాలని అడ్మినిస్ట్రేషన్ భవనం ముట్టడి

- అక్రమ నియామకాలు రద్దు చేయాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ, ఈసీ అనుమతి లేకుండా ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా డైలీ వేజెస్ పేరుతో 100కు పైగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను లక్షల రూపాయలు జేబులు నింపుకొని భర్తీ చేశారని, ఈ నియామకాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అడ్మినిస్ట్రేషన్ భవనం ను విద్యార్థులతో కలిసి ముట్టడించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ యూనివర్సిటీలో గర్ల్స్ హాస్టల్, ఆడిటోరియం నిర్మించాలని ,ఇంజనీరింగ్ కోర్సులు తీసుకురావాలని, స్పోర్ట్స్‌కు సంబంధించిన బీపీఈడీఎం పీఈడీ కోర్సులు తీసుకురావాలని, స్పోర్ట్స్ సమస్యలు పరిష్కరించాలని, హాస్టల్లో స్టడీ టేబుల్స్, కుర్చీలు తీసుకురావాలని, హాస్టల్లో ఉన్న సమస్యలు అన్నింటిని పరిష్కరించాలని, హెల్త్ కేర్‌లో ల్యాబ్ పరికరాలు మెడిసిన్స్ తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమాలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, జయంతి నాయకులు రామకృష్ణ, అక్షయ్, రవీందర్, శివ సాయి, అస్విత్, తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను తనిఖీ చేసిన ఎంపీఓ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని మల్లుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఎంపీఓ ప్రవీణ్ కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన రికార్డులను పరిశీలించి గ్రామాలు అభివృద్ధి చెందాలంటే గ్రామ ప్రజలు ఇంటి పన్నులు, నీటి పన్నులు సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కార్యదర్శి పద్మకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, తదితరులున్నారు. అలాగే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీఓ ప్రవీణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం గ్రామ శివారులో ఉన్న కంపోస్టు షెడ్‌ను ఆయన పరిశీలించి లక్షల రూపాయలతో నిర్మించిన కంపోస్టు షెడ్డు నిరుపయోగంగా ఉండకూడదని సూచించారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-భిక్కనూర్

గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల పారిశుధ్య కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు ప్రత్యేక వాహనాలలో తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో శ్యామ్, నవీన్, సురేందర్, జావీద్, సిద్ధి రాములు, పెద్ద భూషణం, చంద్రం మానెవ్వ, సిద్ధవ్వ ఆయా గ్రామాల కార్మికులు ఉన్నారు.

దర్జీల సంక్షేమానికి ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి

- బోధన్‌లో ఘనంగా టైలర్స్ డే



దర్జి కళా దినోత్సవంలో పాల్గొన్న దర్జీలు

నవతెలంగాణ-బోధన్

రాష్ట్ర ప్రభుత్వం దర్జీల సంక్షేమం కోసం కృషి చేయాలని, దర్జీల కోసం ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి దర్జీ కుటుంబాలను ఆదుకోవాలని మేరు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొట్టూరు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బోధన్ పట్టణంలో మంగళవారం ప్రపంచ దర్జీ కళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాందేవ్ మేరు సంఘం ఆధ్వర్యంలో దర్జీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. అనంతరం దర్జీల కులవృత్తి కోసం రాయితీపై మిషన్లు, ఉచిత విద్యుత్ అందించాలన్నారు. రెడీమేడ్ వస్త్ర వ్యాపారులతో జీవనాధారం కోల్పోతున్న దర్జీలను ఆదుకునేందుకు సంక్షేమ పథకాలు అందించాలన్నారు. కార్యక్రమంలో బటన్ స్టోర్ యజమాని సతీష్, మేరు సంఘం నాయకులు సురేష్, ప్రసాద్, వెంకటేశం, సర్వేశ్వర్, శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ రహితంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-భిక్కనూర్

అంధత్వ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ గాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో కంటి వెలుగు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా నేత్ర పరీక్షలను చేసి అవసరం ఉన్నవారికి కంటి అద్దాలు, అవసరం ఉన్నవారికి కంటి ఆపరేషన్ ఉచితంగా చేయనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుడిసె యాదగిరి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు దాయారి సాయిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, ఏఎంసీ చైర్మన్ భగవంతురెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, సర్పంచ్ స్వామి, సొసైటీ చైర్మన్ వెంకటరెడ్డి, రైతుబంధు గ్రామ కన్వీనర్ దుర్గారెడ్డి, వైద్య ఆరోగ్య సిబ్బంది ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గురుకుల ఇంటర్ మొదటి సంవత్సరానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి

- ప్రిన్సిపాల్ సుహాసినిరెడ్డి

నవతెలంగాణ-ఎడపల్లి

తెలంగాణ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి 2023 విద్యా సంవత్సరానికి గానూ దరఖాస్తులను అర్హులైన అభ్యర్థులు మార్చి 31 లోగా ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని తెలంగాణ గురుకుల బాలికల కళాశాల పాఠశాల ప్రిన్సిపాల్ సుహాసిని రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

ప్రతి మొక్కకు నీరందించాలి



నవతెలంగాణ-రాజంపేట్

ప్రతి మొక్కకు నీరందించి వాటిని సంరక్షించాలని ఎంపీడీవో బాలకిషన్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పెద్దాయిపల్లి గ్రామంలో నర్సరీని సందర్శించారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శికి నర్సరీలోని మొక్కలకు ప్రతిరోజు నీరు ఉదయం, సాయంత్రం రెండు పూటలా పట్టాలని తెలిపారు. ఎండాకాలం సమీపిస్తున్నందున మొక్కలు తొందరగా జర్మినేషన్‌కు తీసుకువచ్చేందుకు తగు శ్రద్ధ వహించాలని, వేసిన విత్తనాలు జెర్మినేషన్ కృషిచేసి వర్షాకాలం వరకు ఇంటింటికి పంపిణీ చేయుటకు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో భాస్కర్, టీఏ రాజు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఫతేపూర్‌లో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

నవతెలంగాణ-బోధన్

సాలూరు మండలంలోని ఫతేపూర్ గ్రామంలో నూతనంగా మంజూరైన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి భూమిపూజను మంగళవారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌కు ఫతేపూర్ గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని సిద్దాపూర్, కల్దుర్కితో పాటు ఆయా గ్రామాలలో ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి ఆదుకున్నందుకు ఎమ్మెల్యే సేవలను మరువలేమని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ షేక్ అమీర్, వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, రైతు సమితి మాజీ అధ్యక్షులు బుద్దే రాజేశ్వర్, ఏఎంసీ వైస్ చైర్మన్ షకీల్, పీఆర్ ఏఈ సాయిలు, మండలాధ్యక్షులు నరసయ్య, ఖాజాపూర్ సర్పంచ్ నాగయ్య, టీఆర్ఎస్ నాయకులు గణేష్ పటేల్, ఖాజా గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ సహకారంతో మండలాభివృద్ధి

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సహకారంతో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని ఎంపీపీ గాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని మల్లుపల్లి గ్రామంలో రూ.15 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను స్థానిక ప్రజాప్రతినిధులు కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుడిసే యాదగిరి, ఆత్మ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, ఏఎంసీ చైర్మన్ భగవంతురెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, పెద్ద మల్లారెడ్డి సొసైటీ చైర్మన్ రాజాగౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పల్లపు శంకర్, నాగభూషణం గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు సిద్ధారెడ్డి, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఉప్పల్వాయి గ్రామ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఆవాస ప్రాంత పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులను మండల విద్యాధికారి యోసేఫ్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక విద్యార్థికి విద్య అందజేయడమే లక్ష్యంగా, చతుర్ముఖ ప్రక్రియలు, చదవడం, రాయడం వచ్చేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ మహమ్మద్, వీవీ వెంకటేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ లేని అభివృద్ధి అసాధ్యం

పలు పాఠశాలల్లో ఆకట్టుకున్న సైన్స్‌ఫెయిర్..

'సైన్స్' మానవ జీవన విధానాన్ని సులభతరం చేస్తుందని, దేశ ఆర్థిక పారిశ్రామిక రంగాలలో సైన్స్ లేకుండా అభివృద్ధి చెందడం అసాధ్యమని పలువురు అన్నారు. మంగళవారం ఉమ్మడి జిల్లాలోని పలు పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రయోగాలు చేపట్టి.. వాటిని ప్రదర్శించారు. విజేతలకు ఉపాధ్యాయులు బహుమతులను అందజేశారు.



బోధన్ : విజయసాయి హైస్కూల్‌లో ప్రయోగాలను తిలకిస్తున్న ఏసీపీ తదితరులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

గాంధారి : పోతాంగల్ కలాన్ ఉన్నత పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ దినత్సవం నిర్వహించినట్టు ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ తెలిపారు. ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ప్రయోగాలు చేసి తోటి విద్యార్థులకు వివరించారు. జ్ఞానేంద్రియాలు, జలచక్రం, ఆదిమానవుల జీవనవిధానం, వేడి చెస్తే గాలి వ్యాకోచం చెందే విధానం, పిన్ హెూల్, కెమెరా గాలి కాలుష్యం, (పవన విద్యుత్) గాలి ద్వారా విద్యుత్ సరఫరా లాంటి ప్రయోగాలను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భయంకరమైన ప్రకృతి విపత్తు నుంచి మానవాళిని సంరక్షించే ఏకైక ఆయుధం సైన్స్ అన్నారు. కార్యక్రమలో ఉపాధ్యాయులు సంతోష్‌రెడ్డి, గంగాకుమార్, బాసెట్టి, లక్ష్మన్ రాథోడ్, నర్సింగ్ రావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ : మండలంలోని మేనూర్ మోడల్ పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని ఆ పాఠశాల ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ వై.గోవిందు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం పాఠశాల విద్యార్థిని విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలను చూసి ఆయన అభినందించారు. పాఠశాలలో సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులు వివిధ ప్రయోగాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.జ్యోతి, సైన్స్ ఉపాధ్యాయురాలు రామేశ్వరి, కావేరి, మండల కోఆప్షన్‌మెంబర్ నిజాముద్దీన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

లింగంపేట్ : మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల సజ్జన్‌పల్లిలో జాతీయ విజ్ఞాన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు దామోదర్ మాట్లాడుతూ.. ప్రముఖ శాస్త్రవేత్త సర్ సి.వి.రామన్ కనిపెట్టిన రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరణను పురస్కరించుకొని భారత ప్రభుత్వం ఫిబ్రవరి 28ను జాతీయ విజ్ఞాన దినోత్సవంగా ప్రకటించిందని అన్నారు. సకల జీవరాశుల మనుగడ సైన్స్‌తో సమ్మిళతమై ఉందని, ప్రపంచాభివృద్ధి సైన్స్‌తో పెనవేసుకుందని తెలిపారు. మానవుని శ్వాస, ధ్యాస అంతా విజ్ఞానమయమని, విద్యార్థులు సైన్స్ పట్ల అభిరుచి, ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శనలో విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రయోగాలు, నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాలలో సైన్స్ బోధిస్తున్న ఉపాధ్యాయినులు పద్మ, కవితను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దామోదర్, ఉపాధ్యాయులు పద్మ, కవిత, జాకిర్, సంగమేశ్వర్ విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని ఆయా పాఠశాలల్లో జాతీయ విజ్ఞాన దినోత్సవ వేడుకలను నిర్వహించినట్టు విద్యాధికారి రామస్వామి తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దామోదర్, నవీన్ కుమార్, బాల్‌రెడ్డి, సురేష్, సంగుబాయ్, రమేష్, పర్వయ్య, ఉపాధ్యాయులు పద్మ, కవిత, జాకిర్, సంగమేశ్వర్ విద్యార్థులు పాల్గొన్నారు.

రామారెడ్డి : మండలంలోని ఆయా పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు సైన్స్ ప్రాధాన్యతను వివరించారు. సైన్స్ ప్రయోగాలను విద్యార్థులచే నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : మండలంలోని దూపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులచే సైన్స్ విజ్ఞాన ప్రాజెక్టును తయారు చేశారు. సైన్స్ విజ్ఞాన ప్రాజెక్టును సైన్స్ ఉపాధ్యాయులు సాయన్న, ప్రభాకర్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండల కేంద్రంలోని శ్రీ మాధవి పాఠశాలలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఎంఈవో రామారావు మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ మల్లెపూల సురేష్‌గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ఉపాధ్యాయులు, బాలబాలికలు తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల మర్కల్ (కామారెడ్డి) నందు నేషనల్ సైన్స్‌డేను నిర్వహించారు. విద్యార్థినులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని, సైన్స్‌కి సంబంధించిన మోడల్స్‌ను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.వి.రాధిక, వైస్ ప్రిన్సిపాల్ పి.మాణిక్యరేఖ, అకాడమిక్ కోఆర్డినేటర్ పి.వనమాల, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

తాడ్వాయి : మండలంలోని కృష్ణాజివాడి ప్రభుత్వ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా పాఠశాల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన, సైన్స్ టాలెంట్ టెస్ట్ క్విజ్ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వైజ్ఞానిక ప్రదర్శనలో 30 ప్రాజెక్టులను విద్యార్థులు సొంతంగా అతి తక్కువ ఖర్చుతో తయారుచేసి ఆ ప్రయోగాల శాస్త్రీయ విషయాలను వివరించారు. వైజ్ఞానిక ప్రదర్శనను సర్పంచ్, ఎంపీటీసీ శాంతాబాయి, నారాయణరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ప్రారంభించారు. నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, సర్పంచ్ జంగం భూషణం, ఎంపీటీసీ శాంతాబాయి నారాయణ, ఉపాధ్యాయులు గిరమబోయి, శ్వేత, రవీందర్, నివేదిత, గంగాధర్, రమేష్, సత్యనారాయణ, రాజేందర్, సుమలత విద్యార్థులు పాల్గొన్నారు.

బోధన్ : సీవీ రామన్ రామన్ ఎఫెక్ట్‌ను పురస్కరించుకుని బోధన్ పట్టణంలోని విజయసాయి హైస్కూల్‌లో సైన్ ఫేయిర్ నిర్వహించారు. బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ సైన్స్ ఫేయిర్‌ను ప్రారంభించి విద్యార్థుల ప్రయోగాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ మేధస్సులో మెదిలిన ఆలోచనలతో మరిన్ని ప్రయోగాలను తయారుచేసి భావిభారత శాస్త్రవేత్తలుగా తయారుకావాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన ప్రయోగాలు అహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్, మేనేజర్ చక్రవర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్దుర్కిలో..

బోధన్ మండలంలోని కల్దుర్కి జడ్పీ హైస్కూల్‌లో ఎంపీడీఓ శ్రీనివాస్ సైన్స్ ఫేయిర్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారుచేసిన ప్రయోగాలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. హెచ్ఎం ఇల్తెపు శంకర్, సీఆర్పీ గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రామారెడ్డి : రెడ్డిపేట్ తండా జెడ్పీహెచ్ఎస్‌లో..



తాడ్వాయిలో..



మద్నూర్‌లో..

బీఆర్ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

బీఆర్ఎస్‌తో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని మత్మాల్ గ్రామంలో పది లక్షల నిధులతో సీసీ రోడ్లను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి కోటి 20లక్షలు మంజూరు అయినట్టు తెలిపారు. నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పథకాలు అమలవుతున్నాయని ఎక్కడ చూసినా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తుంటే ఓర్వలేక కొంతమంది ప్రతిపక్ష నాయకులు అవగాహన లేని మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. నియోజకవర్గంలోని గ్రామాలకు వెళ్లి పనులు ఎలా నడుస్తున్నాయో చూస్తే వారికి అర్థమవు తుందని అన్నారు. గత నాలుగు సంవత్స రాలుగా నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని అన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్రరం నారాయణ, జడ్పీటీసీ ఉషాగౌడ్, ఎల్లారెడ్డి సింగిల్ విండో చైర్మన్ నరసిం హులు, సర్పంచ్ అశోక్‌రెడ్డి, మండలాధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సురేందర్

ఎమ్మెల్యేగా గెలిపిస్తే తిమ్మానగర్ అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే గంగారం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-పిట్లం

ఎమ్మెల్యేగా గెలిపిస్తే తిమ్మానగర్ గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే గంగారం అన్నారు. మంగళ వారం మండలంలోని తిమ్మానగర్ గ్రామంలో హత్ సే హత్ జోడో కార్యక్రమంలో భాగంగా గ్రామ బస్టాండ్ రోడ్డులో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికలలో తనను ఆశీర్వదిస్తే తిమ్మానగర్ గ్రామంలో పేదలకు 100 ఇండ్లు మంజూరు చేస్తానన్నారు. ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు అందజేస్తామన్నారు. ఇంటి నిర్మాణ స్థలాలు లేకపోతే కోటి రూపాయలతో కొనుగోలు చేసి ఇస్తామని హామీ ఇచ్చారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గ్రామంలో పాఠశాల, విద్యుత్, పిట్లం వరకు తారు రోడ్డు, బ్రిడ్జి నిర్మాణాలను చేపట్టానని గుర్తు చేశారు. తెలంగాణ ఇచ్చింది సోనియా గాంధీ అని, తెలంగాణ సెంటిమెంట్ పేరుతో ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలోకి వచ్చి పేదలకు భూ పంపిణీ, డబుల్ బెడ్ రూమ్ నిర్మాణం కోసం ఐదు లక్షలు ఇస్తామని నమ్మించి రూ.3లక్షలు అందిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఎన్నో మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేశారన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెస్తే ఒక్కో ఇంటికి రూ.15 లక్షల చొప్పున అందజేస్తూ రూ.6లక్షల వరకు రుణమాఫీ అందజేస్తామని అన్నారు. రాష్ట్ర, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ చేతు గుర్తుకు ఓటేసి అధికారంలోకి తేవాలని ఆయన కోరారు. ముందుగా మండల కేంద్రం నుంచి గ్రామం వరకు ర్యాలీ నిర్వహించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు జంబిగే హన్మాండ్లు, గ్రామ అధ్యక్షుడు పల్లె శివప్ప, ప్రవీణ్, గొల్ల విట్టల్, సంతోష్‌రెడ్డి, సంగప్ప, ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, పండరి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రావొద్దు

- అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలి
- ఎంపీపీ కానుగంటి శారద నాగరాజు



మాట్లాడుతున్న ఎంపీపీ కానుగంటి శారద నాగరాజు

నవతెలంగాణ-దోమకొండ

వేసవిలో గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఇప్పటి నుంచే తగు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కానుగంటి శారద నాగరాజు అన్నారు. దోమకొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ శారదా ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శారదా, ఆయా గ్రామాల సర్పంచ్‌లు మాట్లాడుతూ.. గ్రామాల్లోని మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి త్వరితగతిన వాటికి మరమ్మతులు చేయించాలని, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. గ్రామాల్లో, విధులలో పశువైద్యాధికారులు రైతులకు అందుబాటులో ఉండటం లేదని సభ్యులు మండల సభాదృష్టికి తీసుకురాగా.. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలకు సిఫారసు చేస్తామని ఎంపీపీ శారదా తెలిపారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, దోమకొండ సీహెచ్‌సీ నందు రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉండేవిధంగా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కంటివెలుగులో భాగంగా పరీక్షలు చేయించుకుని అద్దాలు అవసరం ఉన్న వారికి అద్దాలు అందలేదని లింగుపల్లి సర్పంచ్ సభాదృష్టికి తీసుకురాగా ఆ సమస్యను పరిష్కరించాలని వైద్యాధికారులకు సూచించారు. యూరియా విక్రయాలు పారదర్శకతతో జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జడ్పీటీసీ కోరారు. అంగన్‌వాడీ సెంటర్లకు రెండు నెలల నుంచి పాల సరఫరా జరగట్లేదని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సభాదృష్టికి తెలుపగా సంగమేశ్వర్ గ్రామంలో ఇండ్ల పైన నుంచి ఉన్న కరెంట్ లైన్‌ను తొలగించాలని సభ్యులు కోరారు. సమావేశంలో జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, వైస్ ఎంపీపీ బాపురెడ్డి, ఎంపీడీవో చిన్నరెడ్డి, తహసీల్దార్ కౌశిక, మార్కెట్ కమిటీ చైర్మన్ భగవంత్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ నాగరాజురెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు నర్సారెడ్డి, ఎంపీటీసీలు పీరంగి రాజేశ్వర్, కడారి రమేష్, నిమ్మ శంకర్, సదానంద, వెంకటలక్ష్మి, దోర్నాలక్ష్మి, కోఆప్షన్ షమ్మీ, ఏఈలు సురేందర్‌రెడ్డి, మీనా, శిరిష, రవితేజ, వైద్యాధికారులు భాను ప్రియా, తేజస్విని, ఎంపీవో తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మోడ్రన్ టాయిలెట్ల నిర్మాణం

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని మనఊరు మనబడి పథకంలో భాగంగా మహమ్మదాబాద్ ఎంపీయూపీఎస్ పాఠశాలలో మోడ్రన్ టాయిలెట్ల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతుందని సర్పంచ్ లక్ష్మెట్టి సాయిలు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ సాయిలు మాట్లాడుతూ.. సుమారు రూ.20 లక్షల వ్యయంతో పనులను ప్రారంభించామని, ప్రస్తుతం డోర్ లేవల్ వరకు పనులు వచ్చాయని తెలిపారు. నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు సంరక్షణగా ఉంటుందని తెలిపారు. కాగా సర్పంచ్, పాలకవర్గం సందర్శించి పలు సూచనలు చేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-లింగంపేట్

నాబార్డ్ వారి సౌజన్యంతో ఎన్‌డీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో లింగంపేట్ సొసైటీ పరిధిలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహనా సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగంపేట్ సింగిల్ విండో చైర్మన్ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి రైతుకు బీమా అవసరమన్నారు. రైతులు ఎన్‌డీసీసీ బ్యాంకులో ఖాతాదారులై డబ్బులు జమ చేసుకోవాలన్నారు. బీమా పథకం ద్వారా బ్యాంకులో ఖాతా ఉన్న రైతు మృతి చెందితే రైతు కుటుంబానికి ఎంతో భరోసానిస్తుందన్నారు. అనంతరం కళాజాత బృందం ఇందులో డిజిటల్ లావాదేవీలు, సేవింగ్స్, డిపాజిట్ స్కీమ్స్, ఇన్సూరెన్స్, సైబర్ నేరాల గురించి రైతులకు ఆటపాటలు ద్వారా వివరించారు. కార్యక్రమంలో లింగంపేట్ సింగిల్ విండో చైర్మన్ దేవేందర్‌రెడ్డి, ఎన్‌డీసీసీ బ్యాంక్ మేనేజర్ పి.కుమారస్వామి, ఫీల్డ్ ఆఫీసర్ శేఖర్, ఎఫ్ఎల్‌సీ ప్రమోద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ-రెంజల్

వేధింపులు తాళలేక ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని వీరన్నగుట్టలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎత్తారి రజిత (24) భర్త భీమరాజ్ అదనపు కట్నం తీసుకురావాలని తరచుగా వేధించేవాడు. దీంతో గతంలో పలుమార్లు రజిత ఆత్మహత్యాయత్నం చేసింది. చుట్టుపక్కల వారు గమనించి రక్షించారు. కాగా వేధింపులతో మనస్థాపం చెందిన ఆమె ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి బోదాసు ముత్తమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాయన్న కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి అరవింద్, శివ అనే ఇద్దరు కుమారులున్నారు.

సబ్‌రిజిస్ట్రార్ అవినీతిపై విచారణ చేపట్టాలి

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్



మాట్లాడుతున్న ముజీబ్

కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్ అవినీతిపై విచారణ చేపట్టాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్ డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత కొద్దిరోజులుగా సబ్ రిజిస్ట్రార్‌పై అవినీతి ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఒక అధికారిపై ప్రజలు జాయింట్ యాక్షన్ కమిటీ వేయాల్సిన పరిస్థితి రావడం సిగ్గుచేటన్నారు. సబ్ రిజిస్ట్రార్ శ్రీలత అవినీతితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎవరైనా డాక్యుమెంటరీ రైటర్లు డబ్బులు అడిగితే ఎసిబి అధికారిక నంబర్ 1064, ఎసిబి డిఎస్పీ 7702546789 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. మొన్నటి మున్సిపల్ బడ్జెట్ సమావేశాల రోజు పార్టీలకు అతీతంగా 49 మంది కౌన్సిలర్లు విఎల్టీలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసారని, అయినా కలెక్టర్ స్పందించలేదన్నారు. కలెక్టర్ ఇకనైనా స్పందించాలని, సబ్ రిజిస్ట్రార్ అవినీతిని తక్కువ చేసి చూడటం సరికాదన్నారు. సబ్ రిజిస్ట్రార్ అవినీతిపై విచారణ జరిపించాలని కోరారు. నేడు, రేపు పెండింగులో ఉన్న డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ఎల్లుండి నుంచి 8 రోజుల పాటు డాక్యుమెంట్లు చేయవద్దని, సబ్ రిజిస్ట్రార్‌కు డాక్యుమెంట్లు సమర్పించకుండా తమతో నిరసనలో పాల్గొనాలని డాక్యుమెంట్ రైటర్లను కోరారు.

సబ్‌రిజిస్ట్రార్‌పై రియల్‌ఎస్టేట్ వ్యాపారుల వేధింపులు ఆపాలి

- తెలంగాణ గిరిజన సంఘం కార్యదర్శి ప్రకాష్ నాయక్

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్



మాట్లాడుతున్న ప్రకాష్‌నాయక్

కామారెడ్డి సబ్‌రిజిస్ట్రార్‌పై రియల్ ఎస్టేట్ వ్యాపారులు వేధింపులు ఆపాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ప్రకాష్ నాయక్ అన్నారు. గిరిజన ఆఫీసర్ అనే అక్కసుతో ఆమెపై లేనిపోని ఆరోపణలు చేస్తూ భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. దొంగ రిజిస్ట్రేషన్ చేసుకోవడం కోసం అవినీతిని అంటగట్టడం సబబు కాదని అన్నారు. అవినీతికి పాల్పడినట్టు నిరుపిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలి తప్ప డైరెక్ట్‌గా ఆమెపై దాడులు చేసే విధంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. ఆమెపై ఇదే విధంగా వేధింపులకు పాల్పడితే గిరిజన సంఘం చూస్తూ ఊరుకోదని, ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జబ్బర్ లాల్ రాజు, ఫుల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సైఫ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

- ఐద్వా ఆధ్వర్యంలో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

వరంగల్ మెడికల్ కళాశాలలో చదువుతున్న ప్రీతి అనే అమ్మాయిపై వేధింపులకు పాల్పడిన సీనియర్ సైఫ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని నిజామాబాద్ జిల్లాకేంద్రం లోని నాగారంలో ఐద్వా జిల్లా కమిటీ అధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు సుజాత మాట్లాడుతూ.. కాలేజీ ప్రిన్సిపల్‌కి ప్రీతి పలుమార్లు సైఫ్ అనే సీనియర్‌పై కంప్లైంట్ చేసినా కూడా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడం వల్లనే ఈ పరిస్థితి చోటు చేసుకుందని అన్నారు. ఈ విషయంలో వేధింపులకు పాల్పడిన సైఫ్‌తోపాటు కాలేజీ ప్రిన్సిపాల్‌పై కూడా కఠిన చర్యలు తీసుకొని చట్ట ప్రకారం శిక్షించాలని అన్నారు. ఇతర మెడికల్ కాలేజీల్లో అమ్మాయిలపై ఎలాంటి ర్యాగింగ్లకు పాల్పడకుండా ర్యాగింగ్ చట్టాలను అమలు చేయాలని అన్నారు. అలాగే సిట్టింగ్ జడ్జ్ ద్వారా విచారణ చేసి అమ్మాయికి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, అమ్మాయి కుటుంబానికి 50 లక్షల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని, వారి కుటుంబంలో ఒకరికి జాబ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రజియా, ఉష, స్థానిక నాయకులు మమత, యశోద, పద్మ, దూలంబి, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామాలయం వార్షికోత్సవం

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని తాళ్లరామడుగు గ్రామంలో మంగళవారం సీత రామ చంద్ర స్వామి ఆలయ 7వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించుకుని తాళ్లరామడుగు గ్రామస్థులు సిరికొండ మండల ఆదర్శ రైతులకు సన్మానం చేశారు. ముఖ్య అతిథిగా ధర్పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సైదా, సిరికొండ మండల తహసీల్దార్ గఫ్ఫార్‌మియా, ఆలయ కమిటీ ట్రస్ట్ శాశ్వత చైర్మన్ బచ్చు పురుషోత్తం గుప్త హాజరయ్యారు. పంటను సేంద్రియ, ఆర్గానిక్ పద్ధతుల్లో పండించే ఐదుగురు రైతులను ఎన్నుకుని సన్మానించారు. తలకట్ల గంగారెడ్డి పెద్ద వాల్గోట్, మాలావత్ రవి నాయక్ సిరికొండ ,తోట బాలరాజ్ సిరికొండ,నేరెళ్ల రాజేందర్ న్యావనంది, బొల్లి చిన్న రాజన్న తాళ్లరామడుగు లను సన్మానించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేష్, ఇజాప గోపాల్, భాస్కర్, వీడీసీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ రవీందర్‌ను వెంటనే తొలగించాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ అక్రమాలకు దోపిడీకి నిలయంగా మారిందని, అక్రమ నియమకాలు చేపడుతూ లక్షలాది రూపాలను వైస్ ఛాన్సలర్ వసూలు చేస్తున్నారని, ఈసీ నిర్ణయం లేకుండానే ఇష్టానుసారంగా నియమకాలు చేపడుతూ యూనివర్సిటీని ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని ఈసీ మెంబర్స్‌కు విద్యార్థి సంఘాలుగా పలుమార్లు విన్నవించిన ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం సిగ్గుచేటని భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర కార్యదర్శి జీవియం విఠల్ అన్నారు. మంగళవారం యూనివర్సిటీలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం లేకుండా ఎలాంటి నియామకాలు చేపట్టావద్దని చెప్పిన ఇష్టానుసారంగా పోస్టులను లక్షలాది రూపాయలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. పీహెచ్‌డీ అడ్మిషన్ పొందేందుకు విద్యార్థుల నుండి వేలాది రూపాయలు వసూలు చేస్తూ విద్యను వ్యాపారం చేస్తున్నారని మండి పడ్డారు. ఈసీ గత కొన్ని నెలలుగా సమావేశం నిర్వహించక పోవడం కనీసం యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు అవినీతి అక్రమాల గురించి మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా విసి అనుచరులకు తన బంధువులకు ఇష్టానుసారంగా పోస్టులను కట్టబెడుతున్నారని వాపోయారు. వెంటనే వీసీ రవీందర్ గుప్తను బర్తరఫ్ చేసి అవినీతి అక్రమాలపై సిబిఐ తో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఇంచార్జి రమణ, సూరజ్, విజయ్ యూనివర్సిటీ విద్యార్థులు రవి, మనోజ్ ,చక్రి , ప్రసన్న పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగర అభివృద్ధి పనులపై నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. వైకుంఠధామాలు, నూతన మున్సిపల్ భవనం, అహ్మది బజార్ సమీకృత మార్కెట్ పనుల పురోగతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి అధికారులు, మున్సిపల్, ఇంజనీరింగ్ అధికారులు, ఆర్ అండ్ బి ఎలక్ట్రికల్ అధికారులు, పబ్లిక్ హెల్త్ అధికారులు, ఎలక్ట్రిసిటీ అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

నాయిబ్రాహ్మణులు అన్ని రంగాల్లో ముందుండాలి

- జిల్లా అధ్యక్షులు మహేందర్

నవతెలంగాణ-లింగంపేట్



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నాయి బ్రాహ్మణులు అన్ని రంగాల్లో ముందుండాలని నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు మహేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నాయి బ్రాహ్మణ జనశక్తి సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నందు నాయి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా రేణుక ఎల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం నాయి బ్రాహ్మణ సంఘ భవనంలో జిల్లా అధ్యక్షులు మహేందర్ నాయి మాట్లాడుతూ.. సంఘ అభ్యున్నతికి తోడ్పడుతానని ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఎల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, జిల్లా కోశాధికారి బాబు, జిల్లా ఉపాధ్యక్షులు బాలకిషన్, లింగంపేట పట్టణ అధ్యక్షులు పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో త్వరగా పూర్తయ్యేలా చూడాలి

- డీఈఓ దుర్గాప్రసాద్

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని ధర్పల్లి, దమ్మన్నపేట ప్రభుత్వపాఠశాలలను మంగళవారం జిల్లా వైద్యాధికారి దుర్గాప్రసాద్ ఆకస్మిగంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మన ఊరు మన బడి పనులను పర్యవేక్షించారు. పనులు నాణ్యతతో పాటు వేగవంతం చేసి త్వరగా పూర్తయ్యేటట్టు చూడాలని అన్నారు. అలాగే దుబ్బాక ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యాబోధన ఎంతవరకు అయింది అని విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. మధ్యనభోజనం ఎలా ఉందని, మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రైమరీ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో టీచర్ల కొరత ఉందని, ఉన్న ఐదుగురు టీచర్లకు గ్రామాభివృద్ధి కమిటీ ద్వారా జీతాలు అందించడం జరుగుతుందని డీఈఓ దృష్టికి తెచ్చారు. ప్రతి సంవత్సరం గ్రామాభివృద్ధి ద్వారా సుమారు 6 లక్షల మేర జీతాలను అందించి విద్యార్థులకు విద్యనందించడంపై హర్షం వ్యక్తం చేశారు. రానున్న మే నెలలో బదిలీల సమయంలో టీచర్లను డిప్యుటేషన్‌పై పంపుతానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

చికిత్సతోనే అరుదైన వ్యాధులు నయం

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న సతీష్

రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అరుదైన వ్యాధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాన్ని నిజామాబాద్ నగరంలోని స్థానిక ఇందూర్ న్యూరో సైకియాట్రిక్ ఆస్పత్రిలో మంగళవారం ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షులు సతీష్ షాహ్ తెలిపారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విశాల్ మాట్లాడుతూ రోజువారి జీవిత ప్రయాణంలో అనేక రకాల వైద్య సమస్యలతో పోరాడుతూ ఉంటామని, అందులో అరుదైన వ్యాధులు కూడా కొన్ని ఉన్నాయని తెలిపారు. వాటిలో తల సేమియా, జన్యుపరమైన వ్యాధులు, ఇతర మానసిక వ్యాధులు ఉన్నాయని అన్నారు. వీటన్నిటికీ కారణం మానవుని శరీరంలో కొన్ని రకాల జన్యుపరమైన క్రియచర్యలు, తదితర క్రోమోజోముల ఎదుగుదల లేకపోవడం, కొన్ని రకాల సిండ్రోమ్‌ల వల్ల ఇలాంటి అరుదైన వ్యాధులు సంక్రమిస్తాయని తెలిపారు. వైద్యున్ని సంప్రదించి పరీక్షలు నిర్వహించుకొని వైద్యం అందించినట్లయితే ఆ అరుదైన వ్యాధులు కూడా త్వరితగతిన నయమవుతాయని అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ సభ్యులు రాజ్‌కుమార్ సుబేదార్, డాక్టర్ నవీన్ మాలుతోపాటు, వైద్య సిబ్బంది, ఆస్పత్రికి విచ్చేసిన ప్రజలు పాల్గొన్నారు.

రూరల్ సొసైటీలో నిధుల గోల్‌మాల్

విచారణ చేపట్టిన ఆర్డీవో

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్



విచారణ చేపడుతున్న ఆర్డీవో

రూరల్ సహకార సంఘంలో నిధులు గోల్ మాల్ పై పూర్తి విచారణ జరిపేందుకు సొసైటీ డైరెక్టర్లు రైతుల ఉండి వచ్చిన సమాచారం మేరకు మంగళ వారం ఆర్ డీ వో రవి కుమార్ సొసైటీ ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు చైర్మెన్ రవీందర్‌తో డైరెక్టర్లు సమావేశమై చర్చించారు. సొసైటీలో పని చేసే క్లర్క్ భాస్కర్ 5లక్షలకు పైగా డబ్బులు వాడుకున్నాడని, సీఈవో రాజు కూడా ఐదున్నర లక్షల రూపాయలు వాడుకున్నారన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు మేరకు ఆర్డీవో విచారణ చేపట్టారు.

గుపన్ పెల్లి కి చెందిన పానుగంటి రాజు అనే వ్యక్తి 76 బస్తాలు ధాన్యం ఇచ్చాడు. ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని క్వింటాలుకు 2 కిలోల తరుగు తీశారని ఆయన వివరించారు. అలాగే కుర్నాపల్లి లో సీ ఈ వో రాజు బంధువులు కొండా సాయి కిరణ్ అకౌంట్ లోకి దాదాపు రూ 10 లక్షల వరకు వేసినట్లు.రైతులు పిర్యాదు చేశారు. సొసైటీలో ఎంక్వయిరీ పూర్తి చేసి ఎరువులు సీడ్ తెచ్చి పర్మినెంట్ సీ ఈ వో ను నియమించాలని డైరెక్టర్లు అర్ డీ వో దృష్టికి తెచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పూర్తి విచారణ జరిపి మార్చి 2 న కలెక్టర్ కు నివేదిక సమర్పిస్తామని సొసైటీ డైరెక్టర్లు చైర్మెన్ రావాల్సి ఉంటుంద ని ఆర్డీవో వివరించారు. సొసైటీ చైర్మెన్ రవీందర్, డైరెక్టర్లు ఎండల సందీప్, వసంత, ఆకుల పాపయ్య, నవీన్, గోపు రామ్ బంటు రామారావు, నరేందర్, సంతోష్. హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మండల పీఎంపీ అసోసియేషన్ కార్యవర్గం

నవతెలంగాణ-ఆర్మూర్

మండల పీఎంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డిని హైదరాబాదులో కలిసి సన్మానించారు. మామిడిపల్లి విద్యానగర్ కాలనీలో భూమికి 10 లక్షల ప్రొసీడింగ్ కాపీ అందజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మండల పియం పి అస్సోసియేషన్ అధ్యక్షులు సాయిలు, ఉపాధ్యక్షులు రంజిత్ ,సెక్రటరీ శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ తిరుపతి ,క్యాషియర్ నరేందర్ ,హరిచరణ్, శివరాజ్, గంగాధర్, బబ్లు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేతో అసోసియేషన్ కార్యవర్గం

కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహనిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డి సహకారంతో మండలంలోని 35మందికి తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మంగళవారం మండలకేంద్రంలోని రైతు వేదిక భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్ లబ్దిదారులకు కల్యాణ లక్ష్మీ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కమ్మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుణవీర్ రెడ్డి, తహసీల్దార్ సురేష్, సర్పంచ్ లు సక్కారం అశోక్, పెండే ప్రభాకర్, మారు శంకర్, గుగులోతు భాస్కర్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కాలేరు శేఖర్, ఎంపీటీసీ సభ్యులు మైలారం సుధాకర్, మండల కో ఆప్షన్ సభ్యులు అజ్మత్ హుస్సేన్, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్, ఆయా గ్రామాల బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ప్రారంభం

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని కారేగావ్ గ్రామ శ్మశాన వాటికను సర్పంచ్ దుర్గయ్య మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వ అధికారుల ఆదేశానుసారం గ్రామ సమీపంలోని చెరువు పక్కన నిర్మాణం ప్రారంభించినప్పటికీ గ్రామస్తులు కొందరు శిఖం భూమిలో నిర్మాణపు పనులు వద్దని, పనులు నిలిపివేయాలని కోర్టు స్టేవల్ల పనులు ఆగిపోవడంతో స్పందించిన మండల స్థాయి అధికారులు జోక్యం కలిగించుకొని గ్రామ అసైన్మెంట్ కేటాయించడంతో నిర్మాణ పనులు చేపట్టి పూర్తిచేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గంగారెడ్డి, సెక్రటరీ జాకీర్ హుస్సేన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కనీస సామర్థ్యాలు వచ్చేలా విద్యాబోధన చేయాలి

నవతెలంగాణ-పిట్లం

విద్యార్థులకు కనీస సామర్థ్యాలు వచ్చేలా విద్యా బోధన నిర్వహించాలని ఎంఈఓ దేవిసింగ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో మండల స్థాయి రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్షిక పరీక్షలు సమీపిస్తుండడంతో విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. అనంతరం నోడల్ అధికారి విట్టల్ పాఠశాలల వారిగా రివ్యూ సమావేశం నిర్వహించి అభ్యాసన ఫలితాలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు గణేష్ రావు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

జాకోరాలో 11కేవీ విద్యుత్ మరమ్మతు పనులు

నవతెలంగాణ-వర్ని

మండలంలోని జాకోరా గ్రామంలో గత 50 సంవత్సరాల నుంచి ఊరు మధ్యలో నుంచి 11 కేవీ విద్యుత్ తీగలు స్తంభాలు ఉండడంతో ఈ విషయాన్ని స్థానిక టీఆర్ఎస్ నాయకులు, సర్పంచ్ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కృషితో 11కేవీ విద్యుత్తు తీగలను స్తంభాలను గ్రామం అవతల నుంచి ఏర్పాటు చేసే పనులను మంగళవారం విద్యుత్ అధికారులు ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఇందుకు కృషిచేసిన స్పీకర్ పోచారానికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గోదావరి గణేష్, మండలాధ్యక్షులు గిరి, ఎంపీటీసీ ఏనుగుల సాయిలు, దత్తు, సాయిలు, గోరెమియ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సులో పరిశోధనా పత్రాన్ని సమర్పించిన అందె జీవన్ రావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అసోంలోని బోడోలాండ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన "బోడోలాండ్ ఇంటర్నేషనల్ నాలెడ్జి ఫెస్టివల్‌లో దేశీయ విజ్ఞాన వ్యవస్థ ప్రధాన అంశంగా 'సాంప్రదాయ జ్ఞాన వ్యవస్థ - ఆవిష్కరణలు, అభ్యాసం' ఉప అంశంగా "సూపర్ బ్రెయిన్ యోగా - ఉన్నతమైన మేధస్సుకు, సమాజ క్షేమానికి తగిన యోగా అనే అంశంపై రాష్ట్ర అవార్డు గ్రహీత, విశ్రాంత జిల్లా ఇంటర్ వృత్తి విద్యాధికారి అందె జీవన్ రావు ఈ నెల 28 న అంతర్జాతీయ సదస్సులో తన పరిశోధన పత్రాన్ని సమర్పించి ప్రసంగించారు. క్రమ పద్ధతిలో సూపర్ బ్రెయిన్ యోగా చేయడం వలన జ్ఞాపకశక్తి పెరుగుతుందని తాజా పరిశోధనలు తెలియజేస్తున్నాయని, ఆ పరిశోధన వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. యోగ ప్రాముఖ్యత పెరుగుతున్న తరుణంలో సూపర్ బ్రెయిన్ యోగా వల్ల విద్యార్థులకు మేలు జరుగుతుందని అన్నారు. బహుళ ప్రయోజనాలు ఉన్న సూపర్ బ్రెయిన్ యోగాను పాఠశాలలో శిక్షణలో భాగంగానే పరిగణించి అమలు చేయడం ద్వారా విద్యార్థి లోకం సమగ్రాభివృద్ధికి దోహదపడవచ్చునని అందె జీవన్ రావు తెలిపారు.

4, 5న షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

నవతెలంగాణ-ముప్కాల్

షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ముప్కాల్ ఆధ్వర్యంలో మార్చ్ 4, 5 తేదీల్లో వేముల సురేందర్ రెడ్డి స్మారక ఉమ్మడి బాల్కొండ మండల స్థాయి ఓపెన్ టు ఆల్ షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జక్కుల ప్రవీణ్, గంగుల నవీన్ మంగళవారం తెలిపారు. ఎలాంటి ఎంట్రీ ఫీ లేదన్నారు. 3వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఈ కింది ఫోన్ నంబర్లను 9703340900, 8179258965 సంప్రదించాలని కోరారు.

4న నైతికత, మానవ విలువలు, 6న పర్యావరణ పరీక్షలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఈనెల 4న నైతికత - మానవ విలువలు", 6న "పర్యావరణ విద్య" పరీక్షలు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘురాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ విద్య కమిషనర్ ఆదేశాల మేరకు నిజామాబాద్ జిల్లాలోని 116 జూనియర్ కళాశాలలో ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇదివరకే జవాబు పత్రాలను పరీక్ష కేంద్రాలకు పంపించామని, ప్రశ్నపత్రం అదేరోజు నెట్ నుండి డౌన్లోడ్ చేసుకోవాల్సి ఉంటుందని తెలియజేశారు. విద్యార్థులందరికీ హాల్ టికెట్లు ఇవ్వడం జరిగిందని విద్యార్థులు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హాజరయ్యే విధంగా ఆయా కళాశాల ప్రిన్సిపాల్ చూడాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థి వార్షిక పరీక్షలకు హాజరై కచ్చితంగా పరీక్ష రాయాల్సి ఉంటుందని తెలిపారు. వచ్చే వార్షిక పరీక్షల్లో పరీక్షలు అన్ని ఉత్తీర్ణులైనప్పటికీ ఈ రెండు పరీక్షలకు హాజరుకానట్టయితే ఫెయిల్ మెమో వస్తుందని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. జిల్లాలో రెండు పరీక్షల నిర్వహణకు 116 పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాటు చేశామని, మొత్తం 17,503 విద్యార్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. వీరిలో జనరల్ విద్యార్థులు 15,215 ఒకేషనల్ విద్యార్థులు 2,288 మంది హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ , ప్రైవేట్, ఎయిడెడ్, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీలు, మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు, కేజీబీవీ జూనియర్ కళాశాలలు ఇతర అన్ని కళాశాలలో ఈ పరీక్షలను నిర్వహిస్తారని తెలిపారు.

హ్యాండ్ బాల్ ఫెడరేషన్ కప్ పోటీలకు జిల్లా క్రీడాకారుడు ఎంపిక

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈ నెల 8న జేఎన్ స్టేడియం హనుమకొండలో తెలంగాణ హ్యాండ్ బాల్ సంఘం నిర్వహించినటువంటి సీనియర్ మెన్ హ్యాండ్ బాల్ ఫెడరేషన్ కప్ ఎంపికలో నిజామాబాద్ జిల్లా జట్టు తరఫున పాల్గొని మంచి ప్రతిభ కనబరిచినందుకు సాయికుమార్ మార్చి ఒకటినుండి 4వరకు హర్యానా రాష్ట్రంలోని దిగ్గల్ జిల్లాలో జరగబోయే 34వ సీనియర్ మెన్ ఫెడరేషన్ కప్ పోటీలకు ఎంపిక అయ్యారని తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.పవన్ కుమార్, నిజామాబాదు జిల్లా హ్యాండ్ బాల్ అడక్ కమిటీ చైర్మన్ గంగా మోహన్ చక్రు , కన్వీనర్ పింజ సురేందర్ మంగళవారం తెలిపారు. క్రీడాకారుడిని నిజామాబాద్ జిల్లా అడక్ కమిటీ కన్వీనర్ పింజ సురేందర్, కో- కన్వీనర్ గట్టడి రాజేష్ అభినందించారు. క్రీడాకారుడి ఎంపిక పట్ల జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు టి. విద్యాసాగర్ రెడ్డి, అప్పాల గణేష్, సురేష్, ఎస్ఐఎస్ హ్యాండ్ బాల్ కోచ్ రాజేశ్వర్ హర్షం వ్యక్తం చేశారు.

అర్హులైన వారందరికీ దళిత బంధు ఇవ్వాలి

● డీహెచ్‌పీఎస్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

అర్హులైన వారందరికీ దళిత బంధు పథకం ఇవ్వాలని డిహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు తాళ్లపల్లి లక్ష్మణ్ అన్నారు. సీపీఐ కార్యాలయంలో మంగళవారం డీహెచ్‌పీఎస్ (దళిత హక్కుల పోరాట సమితి) ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్లపల్లి.లక్ష్మణ్ మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బ్యాంకులలో లోన్లు ఇవ్వడం లేదని, ఎస్సీ కార్పొరేషన్ నిధులను, సబ్ ప్లాన్ నిధులను ప్రభుత్వం దారి మళ్లిస్తుందని అన్నారు. దళితుల అభివృద్ధి కోసం, దళితులు నివాసం ఉండే ప్రాంతాలలో మౌలిక వసతులు కల్పించడం కోసం ఏర్పాటుచేసిన సబ్ ప్లాన్ నిధులను బీఆర్ఎస్ ప్రభుత్వం దళిత బంధు పేరుతో దారి మళ్లించి ఎమ్మెల్యేల మద్దతుతో అనర్హులకు కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శాసనసభ బడ్జెట్లో దళితుల అభివృద్ధి కోసం కేటాయించిన 27 వేల కోట్ల రూపాయలను దళితులు నివసించే ప్రాంతాల అభివృద్ధి కోసం, దళిత బంధు కోసం కేటాయించి అరులైన వారందరికీ కలెక్టర్ నేతృత్వంలో సర్వే నిర్వహించి అర్హులకే దళిత బంధు పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. కేసీఆర్ దళితులకు ఇచ్చిన హామీ ప్రకారం 3 ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర మహాసభలు మార్చ్ 31న హైదరాబాద్‌లో జరుగనున్నాయి తెలిపారు. జిల్లా మహాసభలను నిర్వహించి దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని నాయకులను, కార్యకర్తలను కోరారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, డీహెచ్‌పీఎస్ నాయకులు కమలాపురం రాజన్న, ఆనందం, పి.నర్సింగరావు, సురేష్, సాయిలు, జనార్దన్, సాయి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తాళ్లపల్లి లక్ష్మణ్

విజ్ఞాన శాస్త్రంలో సాంఖ్యాక శాస్త్రత అనువర్తితంపై సదస్సు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలోని సాంఖ్యక శాస్త్ర విభాగంలో 11వ జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా 'విజ్ఞాన శాస్త్రంలో సాంఖ్యక శాస్త్ర అనువర్తిత' అనే విషయంపై ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా ప్రొఫెసర్ అరుణ డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆరతి, ప్రధాన వక్తలు లుగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ వి వి హరగోపాల్, సిఈఎస్ఎస్ ప్రొఫెసర్ సి రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ అరుణ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ ఆరతి జాతీయ గణిత దినోత్సవ విశిష్టతను పై వివరించారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ "టెకుచ్ వల్ అనాలసిస్ " ను ఉపయోగించి 'డాటా విశ్లేషణ' చేయడంలో వివిధ రకాల మెలకువలను వరించారు. సిఈఎస్ఎస్ ప్రొఫెసర్ రవి మాట్లాడుతూ " సంప్లింగ్ పద్ధతులు, నూతన ఆవిష్కరణలు పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ కే సంపత్ కుమార్ సమన్వయకర్త, మాట్లాడుతూ డాటా అనాలసిస్, ఆవిష్కరణలు గురించి వివరించారు. కార్యక్రమంలో సాంఖ్యక శాస్త్ర విభాగపు అధ్యాపకులు డాక్టర్ పురుషోత్తం, పి రాజేశ్వర్, ఎం నరసింహులు, బి సందీప్, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సేవలు విస్తరింపజేయాలి

● రెడ్ క్రాస్ డిస్ట్రిక్ చైర్మన్ బుస్సా ఆంజనేయులు

నవతెలంగాణ-(వేల్పూరు)ఆర్మూర్

రెడ్ క్రాస్ సేవలు విస్తరింపజేయాలని రెడ్ క్రాస్ డిస్ట్రిక్ చైర్మన్ బుస్సా ఆంజనేయులు అన్నారు. మండలంలోని ఎక్స్‌రోడ్, మార్కెట్ కమిటీ వద్ద మంగళవారం రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ అధ్వర్యంలో రెడ్‌క్రాస్ డివిజనల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ బుస ఆంజనేయులు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. అందరి సహకారంతో జిల్లా రెడ్ క్రాస్‌కు దేశంలోనే 29 వ స్థానం లభించిందన్నారు. 17000 మెంబర్లతో జిల్లా సంస్థ తెలంగాణలోనే రెండోస్థానంలో నిలిచిందన్నారు. జిల్లా రెడ్ క్రాస్ సేవలు గుర్తించి సంస్థ కు కోటి ఇరవై లక్షలు విలువ చేసే బ్లడ్ డొనేషన్ బస్సు, ఫ్రిజ్ బాక్స్ లను అందించిందన్నారు. సంస్థ సేవలను విస్తరించేందుకు గ్రామ స్థాయిలో స్కూల్, కాలేజీల్లో జూనియర్ రెడ్ క్రాస్, యూత్ రెడ్ క్రాస్‌లుగా సభ్యత్వం అందించి వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. సేవలను గుర్తించి జిల్లా కేంద్రంలో సంస్థ అధ్వర్యంలో తలసేమియా, జనరిక్ మెడికల్ ల ద్వారా ప్రజలకుసేవలందిస్తున్న ట్లు తెలిపారు. త్వరలోనే వృద్ధశమం ద్వారా సేవలందించ నున్నట్లు తెలిపారు. కార్య క్రమంలో జిల్లా రెడ్ క్రాస్ వైస్ ఛైర్మెన్ రాజేశ్వర్, కోశాధికారి కరిపే రవీందర్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ సూర్య నారాయణ, ఆర్మూర్ డివిజన్ ఛైర్మెన్ వెంకటేష్ గౌడ్, వైస్ చైర్మన్ కామినేని శివకుమార్, డివిజన్ స్థాయి మెంబర్లు, మండల ఛైర్మెన్లు పాల్గొన్నారు.

ప్రీతి మృతిపై హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలి

● వివిధ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ, కొవ్వొత్తులతో నివాళ్లు

నవతెలంగాణ-ఆర్మూర్

దారావత్ ప్రీతి మృతిపై రాష్ట్ర హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాత్రి ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, ప్రగతిశీల యువజన సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు బి. కిషన్ , పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం నరేందర్, పీవోడబ్ల్యు జిల్లా ఉపాధ్యక్షురాలు సత్యక్క మాట్లాడుతూ..... కాకతీయ మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ప్రీతిపై సీనియర్ విద్యార్థి సైఫ్ ఉద్దేశపూర్వకంగానే అవమానిస్తూ ర్యాగింగ్ కు పాల్పడుతున్నాడని ప్రీతి తల్లిదండ్రులు పోలీసుల ద్వారా కాకతీయ మెడికల్ కాలేజ్ సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అందువల్లనే ప్రీతి మరణించిందని వారన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి సైఫ్‌కు ఆయనకు సహకరించిన వారందరి పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న ర్యాగింగ్ ను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్. చేశారు కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా సహాయ సహాయ కార్యదర్శి దుర్గాప్రసాద్ ఏరియా అధ్యక్ష కార్యదర్శులు అనిల్ నిఖిల్ నాయకులు వంశీ సాయి ప్రో ప్రవీణ్ ప్రణయ్ పి వై ఎల్ జిల్లా నాయకులు మనోజ్, మండల నాయకులు భోజేందర్ పి ఓ డబ్ల్యు మండల అధ్యక్షులు పద్మ, మరియు విద్యార్థులు పాల్గొన్నారు..


గోవింద్‌పేట్‌లో క్యాండిల్‌లో నివాళ్లు అర్పిస్తున్న పలువురు

గోవింద్‌పేట్ గ్రామంలో..

మండలంలోని గోవింద్‌పేట్ గ్రామంలో ప్రీతి మృతి పట్ల కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బండమీది జమున గంగాధర్, ఎంపీటీసీ యాల రాజ్ కుమార్, మహిళా సంఘ సభ్యురాలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభ్యాస దీపికల పంపిణీ


స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

నవతెలంగాణ-ముప్కాల్

పదవ తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన 'అభ్యాస దీపిక'లను మంగళవారం కేజీబీవీ ముప్కాల్ పాఠశాల విద్యార్థులకు ఎంపీపీ సామ పద్మ వెంకటరెడ్డి, జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సారెడ్డి చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నాయకుడు పద్మ కిషన్, పాఠశాల ప్రిన్సిపాల్ జి.వినోద, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

7538 జీవాలకు నట్టల నివారణ మందుల పంపిణీ

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని గుత్ప, మామిడిపల్లి గ్రామాల్లో నట్టల నివారణ మందుల పంపిణీ చేశారు. ప్రతి రైతు తమ జీవాలకు నట్టల నివారణ మందులను వేయించాలని పశు వైద్యులు కిరణ్ దేశ్‌పాండే తెలిపారు. ఈ సందర్భంగా 7538 జీవాలకు మందులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో పశు వైద్యురాలు ఉమెమ సాహెర్ వాసు, సాహెరా వసు, వీఎల్ఓ వినీత, జేవీవో గంగాజమున, వీఏ అహ్మద్ భాషా, శ్రీనివాస్, సాజిద్, సిబ్బంది సుదీర్, దిలీప్, బేగ్, జైల్ సింగ్, పశువుల యజమానులు పాల్గొన్నారు.


నట్టల మందు వేయిస్తున్న పశువైద్యులు

జీవాలకు నట్టలనివారణ మందులు పంపిణీ

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని చెంగల్ గ్రామంలో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులను అందజేశారు. ఈ కార్యక్రమానికి యంపిపి ఆర్మూర్ మహేష్, సర్పంచ్ చిన్నరెడ్డిలు మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ యదవుల అభివృద్ధికి కృషి చేస్తున్నారని, ఇందులో బాగంగానే ఉచితంగా గొర్రెల యూనిట్లను అందజేసి ఉపాధి కల్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ, మీఏ నరేష్, సంతోష్ తదితరులు ఉన్నారు.


భీంగల్‌లో నట్టల మందు వేస్తున్న ప్రజాప్రతినిధులు

జక్రాన్‌పల్లి:మండలంలోని కొలిప్యాక్, జక్రాన్‌పల్లి గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించామని పశువైద్యులు కృష్ణ మంగళవారం తెలిపారు. నివారణ మందు తాగించడం వల్ల గొర్రెలు, మేకలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హరిత మండలాల రైతు సమన్వయ అధ్యక్షుడు డీకొండ శ్రీనివాస్, జక్రాన్‌పల్లి సర్పంచ్ చంద్రకళ, బాల కిషన్, జక్రాన్ పల్లి ఎంపీటీసీలు రూపాల గంగారెడ్డి, తలారి మరియా సతీష్, మండల కోఆప్షన్ నెంబర్ బులెట్ అక్బర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు సిబ్బందికి సన్మానం

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని బట్టాపూర్ గ్రామంలో వారంరోజులుగా కంటి వెలుగు కార్యక్రమం కొనసాగించి మంగళవారం ముగియడంతో వారి సేవలకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కంటి వెలుగు సిబ్బందిని సర్పంచ్ కట్టం పద్మాసాగర్, ఉపసర్పంచ్ చిల్క భగీరథ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రసన్న ప్రియ, సూపర్ వైజర్ విజయ, కంటి వెలుగు ఇంచార్జి ఆకుల మారుతి, ఎంపాహెచ్ఏ పందిరి, ఏఎన్ఎం రాజహంస, సుమలత, కంటి వెలుగు సిబ్బంది శ్రావ్య, కూశ రాకేశ్, బట్టాపూర్ కారోబార్ సతీష్, అంగన్వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

దర్జీలను సన్మానించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్

టేలర్స్‌డేని పురస్కరించుకుని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల క్యాంపు కార్యాలయంలో దర్జీ లకు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త మాట్లాడుతూ.. కుల వృత్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదని తెలిపారు. మేరు సోదరులు వివిధ సమస్యలు తన దృష్టికి తీసుకవచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మేరు సంఘం నాయకులు, హన్మంత్ రావు, దేవదాస్, పాండు, తదితరులు పాల్గొన్నారు.